క్లుప్తంగా

ఉచిత కంటి వైద్య శిబిరం



కామారెడ్డి టౌన్: జాతీయ మానవ హక్కుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో ఉచితంగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు చేసి కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం జాతీయ చైర్మన్ డాక్టర్ ఉల్లంగ నాగరాజు, హ్యాపీ లైన్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉచిత ప్రయాణంపై సమీక్షించాలి

కామారెడ్డి అర్బన్: తెలంగాణలో అన్ని రకాల ఆర్‌టీసీ బస్సుల్లో సీనియర్ సిటిజన్లకు 50 శాతం రాయితీ ఇవ్వాలని కామారెడ్డి కాకతీయ నగర్ కాలనీ వెల్ఫేర్ సొసైటీ గౌరవ అధ్యక్షుడు డీవీఎల్ఎస్ శర్మ, ఆర్టీసీ ఎండీని వినతి పత్రం ద్వారా కోరారు. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లో వయోవృద్ధులకు 50 శాతం రాయితీ కల్పిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణంతో వృద్ధులు, వికలాంగులకు సీట్లు లభించడం లేదని, ప్రయాణం కష్టంగా మారిందని, సమీక్షించి పేద మహిళలకు పల్లె వెలుగు బస్సులకు పరిమితం చేయాలని కోరారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు



దోమకొండ: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై మురళి అన్నారు. మంగళవారం సాయంత్రం మండల కేంద్రంలోని సంఘమేశ్వర్ గ్రామ మూల మలుపు వద్ద డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఏఎస్సై సుబ్రహ్మణ్యాచారి, కానిస్టేబుళ్లు సామ్రాట్, కిరణ్, చంద్రకాంత్ తదితరులున్నారు.

నస్రుల్లాబాద్‌లో..

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలోని బొమ్మన్‌దేవ్‌పల్లి ఎక్స్ రోడ్డులో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు పరీక్షలు చేశారు. పలువురికి జరిమానాలు విధించారు.

పార్టీలకు అతీతంగా పని చేయాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మున్నూరు కాపు కుటుంబ సభ్యులు పార్టీలకు అతీతంగా పని చేయాలని ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బసవరాజు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బసవరాజు, మున్నూరు కాపు సంఘ సభ్యులతో కలిసి మున్నూరు కాపు మాసపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కల్లూరి నరహరి, కల్లూరి బాల్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ప్రముఖ శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి పేరున రూపొందించిన 2024 క్యాలెండర్‌ను మంగళవారం నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ రాజ్‌దాస్, జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యాలయంలో ఉన్న పలువురికి క్యాలెండర్లను పంపిణీ చేశారు. నాయకులు ధనుంజయ్, దేవిసింగ్, వసూరాం, ప్రవీణ్, సయ్యద్ పాల్గొన్నారు.

మాజీ మంత్రికి స్వాగతం

కామారెడ్డి రూరల్: నిజామాబాద్‌లో మున్నూరుకాపు ప్రగతి నగర్‌లో మంగళవారం నిర్వహించనున్న ఆత్మీయ సమ్మేళనానికి హైదరాబాద్ నుంచి కామారెడ్డికి వచ్చిన మాజీ మంత్రి షబ్బీర్ అలీని కామారెడ్డి 10వ వార్డు కౌన్సిలర్ ఉరుదొండ వనిత, నీలం వెంకటి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం నిజామాబాద్‌కు ఊరేగింపుగా తరలివెళ్లారు. నాయకులు చెట్కూరి గంగారాం, మర్కంటి స్వామి, నాగల్ల రాజయ్య తదితరులు ఉన్నారు.

ట్రాక్టర్ గడ్డి విరాళం

భిక్కనూరు: మండల కేంద్రంలోని సిద్దరామేశ్వరాలయంలోని కోడె దూడలకు ఆహారం కోసం పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన ముగ్గురు రైతులు మంగళవారం గడ్డిని విరాళంగా అందజేశారు. గ్రామానికి చెందిన రైతులు పోచమ్మల బాబు, మంగలి బాబు, పాపగళ్ల నర్సింలు తమ పంటపొలంలోని వరి గడ్డిని ఆలయంలోని కోడె దూడల ఆహారం కోసం విరాళంగా అందజేశారు. ఈ రైతులను ఆలయ పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షుడు అందె మహేందర్ రెడ్డి అభినందించారు.

జోరుగా బెల్టు షాపుల నిర్వహణ

- రూ.లక్షల్లో టెండర్లు వేసి దక్కించుకుంటున్న వైనం
- గ్రామాల అభివృద్ధి పేరుతో టెండర్లు వేస్తున్న గ్రామస్తులు
- ఇళ్ల మధ్యలో నిర్వహించడంతో ఇబ్బందులు పడుతున్న పల్లె ప్రజలు
- కన్నెత్తి చూడని ఎక్సైజ్ శాఖ అధికారులు



బెల్టు షాపులో మద్యం అమ్ముతున్న నిర్వాహకులు

బీబీపేట: జిల్లాలో బెల్టు షాపుల దందా ఎక్సైజ్ సిబ్బంది కళ్లెదుటే సాగుతోంది. ప్రాథమిక వైద్యానికి దూరంగా ఉన్న పల్లెలు ఉన్నాయేమో కానీ చీప్ లిక్కర్ దొరకని గల్లీ లేదన్నది అధికారులతో పాటు అందరికీ తెలిసిన వాస్తవం. కిరాణా షాపుల కంటే బెల్ట్ షాపులు అధికంగా ఉన్న గ్రామాలు కూడా ఉన్నాయి. కొన్ని పల్లెల్లో అయితే పండుగలు, ప్రత్యేక సమయాల్లో మద్యం వ్యాపారం బార్లతో పోటీ పడుతోందని మందు బాబులు గర్వంగా చెప్పుకుంటున్నారు. ఇదిలా ఉంటే బెల్ట్ షాపులను నిర్వహిస్తున్న వారి ఇంట, వారికి అండగా ఉండే అధికారుల జేబుల్లో కాసులు కురుస్తుంటే, మద్యానికి బానిసైన వారి బతుకులు మాత్రం ఆగమవుతున్నాయి. జిల్లాలో ఏ మండలంలో చూసినా వందకు పైగానే బెల్టు షాపులు కనిపిస్తున్నాయి. సారా విక్రయాలను పూర్తిగా కట్టడి చేయడంతో మద్యం విక్రయాలు పెరిగాయి. దీంతో బెల్టు షాపులు సైతం రెట్టింపయ్యాయి. రాజంపేట, భిక్నూర్, బీబీపేట, దోమకొండ, మాచారెడ్డి ప్రాంతాల్లో అయితే ఏ గ్రామంలో చూసినా పదుల సంఖ్యలో బెల్టు షాపులు దర్శనమిస్తున్నాయి.

పచ్చని కాపురాల్లో చిచ్చు..

పొద్దంతా కష్టపడి చేసిన కూలీ డబ్బుల్లో చాలా వరకు బెల్టుషాపుల్లోనే ఖర్చు పెడుతున్నారు. ఒకప్పుడు మద్యం కొనాలంటే పట్టణాలకు వెళ్లాల్సి వస్తుందనే భయంతో ఎవరు కూడా వెళ్లేవారు కాదు. కానీ ప్రస్తుతం ప్రతి పల్లెలో బెల్టుషాపులు తెరవడంతో అక్కడే మద్యం కొనుక్కొని తాగి ఊగుతున్నారు.

బెల్టు షాపులు అధికారుల కనుసన్నుల్లోనే కొనసాగుతున్నాయని, ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని మండల సభల్లో ప్రజాప్రతినిధులు వాపోతున్నారు. ఇంత జరిగినా ఇప్పటి వరకు బెల్టుషాపులపై ఎలాంటి దాడులు చేయకపోవడం, కేసులు నమోదు చేయకపోవడం గమనర్హం.

కల్తీకి అడ్డాలుగా బెల్టుషాపులు

వైన్స్ దుకాణాల నుంచి తెచ్చుకున్న మద్యాన్ని బెల్టు షాపుల నిర్వాహకులు కల్తీ చేసి అమాయకులకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో బాటిల్ నుంచి కొంత మద్యాన్ని తీసి దాంట్లో తిరిగి నీళ్లను కలుపుతూ సొమ్ము చేసుకుంటున్నారు. అంతే కాకుండా ఫుల్ బాటిల్ సీసాలోని మద్యాన్ని క్వార్టర్, 90 ఎంఎల్‌లో కొంత మేర పోసి మిగిలిన దాంట్లో నీళ్లు, కల్తీ మందు పోసి మద్యాన్ని యథేచ్ఛగా అమ్ముతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

పేరుకే కిరాణం.. జరిగేది మద్యం వ్యాపారం

అనేక మంది పేరుకు కిరాణా దుకాణం నిర్వహిస్తూ లోపల మాత్రం మద్యం వ్యాపారం చేస్తున్నారు. ఒక్కొక్క బాటిల్‌పై రూ.30 నుంచి రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే మామూళ్లు ఎలా ఇవ్వాలి. మేము ఎలా బతకాలని బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఆశ్చర్యమేమిటంటే గతంలో సారా విక్రయాలకు పేరుగాంచిన తండాల్లో సైతం నేడు బెల్టుషాపులు రాజ్యమేలుతున్నాయి. జిల్లాలోని లైసెన్స్ దుకాణాల్లో మద్యం అమ్మకాలు 40 శాతం ఉంటే బెల్టు షాపుల ద్వారా మాత్రం 60 శాతం విక్రయాలు సాగుతున్నాయని అంచనా. అధికారులు మాత్రం అక్కడక్కడా తూతూ మంత్రంగా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

కాంగ్రెస్ ప్రభుత్వంలో మంచి రోజులు



మద్నూర్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే



పెద్ద ఎక్లార గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

మద్నూర్(జుక్కల్): కాంగ్రెస్ ప్రభుత్వంతో నియోజకవర్గంలో మంచిరోజులు రాబోతున్నాయని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం విజయోత్సవ సభను ఏర్పాటు చేశారు. ముందుగా కాంగ్రెస్ నేత తమ్మెవార్ భగవాన్ మృతికి సంతాపం తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..నా గెలుపుకు కృషి చేసిన ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకు చూసుకుంటానన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ

మద్నూర్(జుక్కల్): మండలంలోని పెద్ద ఎక్లార గేటు వద్ద బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను మంగళవారం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులతో పాటు ఎమ్మెల్యే భోజనం చేశారు. నిత్యం పాఠశాలలో తరగతులు ఎలా కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని తెలుసుకున్నారు. పాఠశాలలో ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. టీపీసీసీ ఐటీ సెల్ ఉపాధ్యక్షుడు సాయి పటేల్, మార్కెట్ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్, తదితరులున్నారు.

ఆరు గ్యారంటీ పథకాలతో ప్రజలకు భరోసా

నిజాంసాగర్(జుక్కల్): ఆరు గ్యారంటీ పథకాలు, సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా జనరంజక ప్రభుత్వ పాలనకు ఆకర్షితులై ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అన్నారు. మంగళవారం మహమ్మద్‌నగర్ మండలంలోని హసన్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు పలువురు ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నాయకులు జయప్రదీప్, వెంకాగౌడ్ తదితరులు ఉన్నారు.

వీరబ్రహ్మంగారి ఆలయంలో ప్రత్యేక పూజలు

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని వీరబ్రహ్మంగారి ఆలయంలో మంగళవారం హనుమాన్ చాలీసా కార్యక్రమం నిర్వహించారు. హనుమాన్ చాలీసా కార్యక్రమంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పాల్గొని పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేను సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. హసన్‌పల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

బీసీ డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలి



మాట్లాడుతున్న బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు

కామారెడ్డి టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే బీసీ డిక్లరేషన్‌కు చట్టబద్ధత కల్పించి అమలు చేయాలని బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. మంత్రి వర్గంలో బీసీలకు అధిక ప్రాధాన్యం కల్పించాలని, నామినేటెడ్ పదవులు అధికంగా బీసీలకు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దోల్ల మహేష్, ఎల్లారెడ్డి అధ్యక్షుడు దయాకర్, నాయకులు నరేష్, రాము, చారీ, ప్రవీణ్, శ్రీధర్ తదితరులున్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

- మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఏనుగు రవీందర్‌రెడ్డి

బాన్సువాడ : బీర్కూర్ మంజీర ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే ముందుగా అధికారులపై చర్యలు తీసుకునేలా సంబంధిత మంత్రికి ఫిర్యాదు చేస్తామని మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం బీర్కూర్‌లో మంజీరా నదిలో చెక్ డ్యాం నిర్మాణం చేపట్టే ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే టిప్పర్లు, జేసీబీలను సీజ్ చేయాలని అధికారులకు సూచించారు. చెక్ డ్యాం నిర్మాణం పేరిట ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. నాయకులు విజయ్ ప్రకాష్, బస్వరాజ్, బోయిని శంకర్, ఇక్బాల్, యామరాములు ఉన్నారు.

ఎంపీపీపై క్రిమినల్ కేసు నమోదుకు డిమాండ్



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నేతలు

కామారెడ్డి టౌన్: అక్రమ మైనింగ్ నడుపుతున్న మాచారెడ్డి ఎంపీపీ నర్సింగ్‌రావుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. అక్రమ మైనింగ్, పేలుళ్ల వల్ల రైతులు, గ్రామస్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే అధికారులు విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింలు ఉన్నారు.



చందాపూర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న విద్యుత్ స్తంభం

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): చందాపూర్‌లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని సరిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. కొన్నేళ్లుగా రోడ్డు పక్కన ఉండటంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విద్యుత్ స్తంభానికి మినీ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఏ మాత్రం ఈ స్తంభానికి తగిలినా కరెంట్ షాక్ తగిలే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని సరిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కళాశాల భూములను పరిరక్షించాలి



మాట్లాడుతున్న ఏబీవీపీ జిల్లా కన్వీనర్ కృష్ణ

భిక్కనూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సంబంధించిన భూములను పరిరక్షించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ కృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన భిక్కనూరులో మాట్లాడారు. 1984లో కళాశాలకు 10 ఎకరాల భూమిని కేటాయించారని, ప్రహరీని 200 మీటర్ల వరకు మాత్రమే నిర్మించారని మిగతా 550 మీటర్ల వరకు నిర్మించాల్సి ఉన్నప్పటికి అధికారులు స్పందించడం లేదన్నారు. కళాశాలకు పూర్తిగా ప్రహరీ లేకపోవడంతో రూ.కోట్ల విలువ చేసే భూమిని కబ్జా చేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సమావేశంలో ఏబీవీపీ నేతలు సంజయ్, మధు, సాయి, సంపత్, మనోజ్, భాను పాల్గొన్నారు.

వారం రోజుల్లో రెవెన్యూ సేవలు

- బాన్సువాడ ఆర్డీవో భుజంగరావు



మాట్లాడుతున్న బాన్సువాడ ఆర్డీవో

నిజాంసాగర్(జుక్కల్): వారం రోజుల్లో మహమ్మద్ నగర్ మండల తహసీల్ కార్యాలయం నుంచి రెవెన్యూ సేవలు అందుబాటులోకి వస్తాయని బాన్సువాడ ఆర్డీవో భుజంగరావు అన్నారు. మంగళవారం నిజాంసాగర్ మండల తహసీల్ కార్యాలయాన్ని ఆర్డీవో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తహసీల్ కార్యాలయానికి సంబంధించి రెండు రోజుల్లో ఉద్యోగ పోస్టులు భర్తీ అవుతాయన్నారు. ధరణి సేవలతో పాటు మీ–సేవలో అందే సేవలు అందుతాయని ఆయన పేర్కొన్నారు. అన్ని ధ్రువ పత్రాలను సకాలంలో అందించాలని ఆయన అధికారులకు సూచించారు. సమావేశంలో తహసీల్దార్ భిక్షపతి, గిర్దావర్ సాయిలు తదితరులున్నారు.

ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి



ఎర్రాపహాడ్‌లో మాట్లాడుతున్న డాక్టర్ రేవంత్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రేవంత్ అన్నారు. ఎర్రాపహాడ్ రైతు వేదిక కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన రైతుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. రైతులు ఈ సీజన్‌లో వేరుశనగ, కుసుమ, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, వేరుశనగ వంటి పంటలను సాగు చేయాలన్నారు. పంటలను వేసుకునే ముందు విత్తన రకాలు, మోతాదు, విత్తన శుద్ధి తదితర విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఆరుతడి పంటలు వేసినట్లయితే తక్కువ నీటితో ఎక్కువ దిగుబడులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు అనీల్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్, విస్తరణాధికారి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి



రిజిస్టర్లను పరిశీలిస్తున్న ఎంఈవో దేవిసింగ్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జెడ్పీటీసీ

పిట్లం(జుక్కల్): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని మండల విద్యాధికారి దేవిసింగ్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం మండలంలోని మద్దెలచెరువు, బండపల్లి గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. పాఠశాలలోని రిజిస్టర్లను పరిశీలించి పాఠశాల సిబ్బందికు పలు సూచనలు ఇచ్చారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మెనూ ప్రకారం ప్రతిరోజు విద్యార్థినులకు భోజనం అందించాలని నాగిరెడ్డిపేట జెడ్పీటీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డి సూచించారు. నాగిరెడ్డిపేట మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యార్థినులతో కలిసి ఆయన మధ్యాహ్న భోజనం తిన్నారు. మెనూ ప్రకారం గుడ్డును వడ్డించాల్సి ఉండగా ఎందుకు పెట్టలేదని ప్రిన్సిపాల్ వీణను ఆయన ప్రశ్నించారు. పాఠశాలలో స్టాక్ లేకపోవడం వల్ల విద్యార్థినులకు కోడిగుడ్డును అందించలేకపోయామని ప్రిన్సిపాల్ తెలిపారు. మరోసారి ఇలా జరగకుండా చూస్తామని ఆమె చెప్పారు.

10 వేల మొక్కలకు తగ్గకుండా నాటాలి



గర్గుల్‌లో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీవో మలహరి

కామారెడ్డి రూరల్: ప్రతి నర్సరీలో 10 వేల మొక్కలకు తగ్గకుండా నాటాలని ఎంపీవో మలహరి సూచించారు. మంగళవారం గర్గుల్ గ్రామంలో నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...బ్యాగ్ ఫిల్లింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని పేర్కొన్నారు. నర్సరీలో రానున్న హరితహారానికి మొక్కలు సిద్ధం చేయాలన్నారు. నెలాఖరు వరకు 100 శాతం పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర



ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

భిక్కనూరు: కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర మంగళవారం భిక్కనూరు మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామానికి చేరింది. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రమేశ్ రెడ్డి, నేతలు నరేందర్‌రెడ్డి, నర్సారెడ్డి, ఏక్‌నాథ్, రాజేందర్, బాల్‌లింగం, వీరేశంలు పాల్గొన్నారు.

బీఎల్‌వోలకు అవగాహన సదస్సు



నస్రుల్లాబాద్(బాన్సువాడ): ఉమ్మడి బీర్కూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో బూత్ లెవెల్ ఆఫీసర్లకు మంగళవారం ఓటరు జాబితాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజు మాట్లాడుతూ.. ప్రతి బూత్ పరిధిలో ఉన్న కొత్త ఓటర్లు నమోదు, మరణించిన వారి వివరాలను తొలగించాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ మాస్టర్ ట్రైనర్లు, గిర్దావార్ అంజు, ఎంపీడీవో రాము పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): క్రిస్మస్ వేడుకలను చర్చిలలో ఘనంగా నిర్వహించాలని మెదక్ డయాసిస్ బోర్డు కన్వీనర్ విల్సన్ అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డిలో చర్చి ఫాదర్లతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 25న ఏసు క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. చర్చి ఫాదర్లు జయరాజ్, ఏసుదాస్, ప్రసాద్ తదితరులున్నారు.

బకాయి బిల్లులు చెల్లించండి

బాన్సువాడ రూరల్: తమకు రావాల్సిన బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ కొత్తాబాదిలో మంగళవారం డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో 43 మంది లబ్ధిదారులు డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించుకోగ రూ.కోటి 18 లక్షల బిల్లులు మాత్రమే పంపిణీ చేశారన్నారు. నెలలు గడిచినా ప్రభుత్వం నుంచి రావాల్సిన మిగతా బిల్లులు పూర్తిస్థాయిలో రాకపోవడంతో అధికారులను ఆశ్రయించామన్నారు. రికార్డులు పరిశీలించిన అధికారులు, లబ్ధిదారులకు రూ.కోటి 40లక్షల బిల్లులు కాంట్రాక్టర్ ద్వారా గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులకు ఇచ్చినట్లు తేలింది. దీంతో తమకు రావాల్సిన రూ. 22 లక్షలు పంపిణీ చేయకుండా నొక్కేశారని ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వంద శాతం వసూలు చేయాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామంలో ఇంటింటికి తిరిగి వంద శాతం పన్నులను వసూలు చేయాలని నాగిరెడ్డిపేట ఎంపీవో శ్రీనివాస్ సూచించారు. మెల్లకుంటతండా జీపీ కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట స్థానిక సర్పంచ్ కేస్లీబాయి, పంచాయతీ కార్యదర్శి సవాయిసింగ్ ఉన్నారు.

గోమాతకు అంత్యక్రియలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బొల్లారంలో మంగళవారం గోమాతకు గ్రామస్తులు అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామంలోని శివాలయానికి దేవుడి పేరిట వదిలిన ఆవులలో ఒక ఆవు మంగళవారం అనారోగ్యంతో మృతిచెందింది. దీంతో గ్రామస్తులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ట్రాక్టర్‌లో గోమాత మృతదేహం ఉంచి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు చేపట్టి అనంతరం పూడ్చారు.